కనులపండువగా కల్యాణం



మూలస్థానేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): ధర్మప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో రంగనాథుడి కల్యాణోత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. నటరాజ కళాక్షేత్ర ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాలను చిన్నారులు ప్రదర్శించారు. రంగనాథస్వామి దేవస్థాన ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎరబోలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

• మహేశ్వరినగర్‌లోని డీఎస్సెస్సెన్ కల్యాణ మండపంలో మూలస్థానేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మధుసూదన్‌రావు, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మూలస్థానేశ్వర దేవస్థాన ఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సుదర్శన యాగం



నెల్లూరు(బృందావనం): ధర్మ ప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మహా సుదర్శన యాగాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. నరసింహ, గరుడ, ధన్వంతరి యాగాలను జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఆదాలకు కళాభినందన

నెల్లూరు(బృందావనం): హరనాథపురం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కళాకారుడు సోమా పద్మారత్నం కళాభినందనలను తెలియజేశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి చిత్రాన్ని పెన్సిల్ ఆర్ట్‌తో చిత్రీకరించారు. ఈ క్రమంలో చిత్రపటాన్ని ఎంపీకి నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేశారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ డైరీని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు గురువారం ఆవిష్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బాషా, చీఫ్ అడ్వైజర్ యూసఫ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అల్తాఫ్, అధ్యక్షుడు నవాబ్‌జానీ, సెక్రటరీ రియాజ్, రీజినల్ సెక్రటరీ రఫీ, ఉబేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత



ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తంబి శ్రీనివాసులు తన కుమార్తె లక్ష్మీ వెంకట మనోజ్ఞ జ్ఞాపకార్థం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడా దుస్తులు బహూకరించారు. పాఠశాలకు సంబంధించి క్రీడాకారులుగా రాణిస్తూ వివిధ పోటీల్లో పతకాలు సాధించిన 30 మంది విద్యార్థినులకు ప్రిన్సిపల్ సుజాత, కృష్ణపట్నం ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు శిరీష, స్పందన పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిప్సం అందుకున్న రైతులతో అధికారులు

ముత్తుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందజేసే ఎరువులు, జిప్సంలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. ముత్తుకూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన వేరుశనగ రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా 50 మంది వేరుశనగ రైతులకు ఎకరాకు నాలుగు బస్తాల చొప్పున జిప్సం పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్ర సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్, మండల ఏఓ జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : పాడి రైతుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలో బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌రెడ్డి స్వగ్రామం పొట్లపూడిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనకు పలువురు నేతలు, అభిమానులు శాలువా, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తనకు రాష్ట్రస్థాయి పదవి లభించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు కాంగ్రెస్‌తో టీడీపీ జతకట్టి తనను విజయా డెయిరీ చైర్మన్ నుంచి దించితే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయి పదవి లభించినట్లు తెలియజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌కు, మంత్రి కాకాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు అడపాల అవినాష్‌రెడ్డి, నేతలు ఎడిచర్ల శ్రీనివాసులుగౌడ్, వేగూరు శ్రీనివాసులు, హరిప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

‘రవీంద్రభారతి’పై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు (టౌన్): ఫీజుల దోపిడీకి నిలయమైన రవీంద్రభారతి స్కూల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ) రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల ఎదుట ధర్నాను గురువారం చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర, వెంకటాచలం మండలాధ్యక్షుడు శేషు, ప్రసాద్, రెహ్మాన్ కార్తీక్, అన్వేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి మేకపాటి పరామర్శ



నెల్లూరు (టౌన్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎమ్మెల్సీ వ్యక్తిగత కార్యదర్శి మృతికి తీవ్ర సంతాపం తెలియజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతుడై త్వరలో అందరికీ సేవలందించాలని ఎమ్మెల్యే కాంక్షించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



నెల్లూరు (టౌన్): సోషల్ ఎమోషనల్ లెర్నింగ్, సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపథీ అండ్ కైండ్‌నెస్ అనే అంశాలపై నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ సూచనల మేరకు.. యునెస్కో వారి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతి మూలాలను విద్యార్థుల్లో నింపాలని అధ్యాపకులకు సూచించారు. దాదాపు 180 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. యునెస్కో ఇండివిడ్యువల్ స్పెషలిస్ట్ శోభిత, డాక్టర్ సువర్ణ, విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, కళాశాల పీఆర్వో జోజీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు సిటీ: ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞను గురువారం ఆయన చేశారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు సిటీ: జిల్లాలోని గ్రామీణ వైద్యులకు కేన్సర్‌పై అవగాహన అవసరమని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేకల వెంకటరమణయ్య పేర్కొన్నారు. కేన్సర్‌పై గ్రామీణ వైద్యులకు అవగాహన కార్యక్రమాన్ని రామచంద్రారెడ్డి హాస్పిటల్లో గురువారం నిర్వహించారు. తొలుత విజయవాడలో నిర్వహించనున్న గ్రామీణ వైద్యుల మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా నేతలు రవీంద్రబాబు, రోజారాణి, గౌస్‌బాషా, వేణుగోపాల్, వీరయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెడిపోయిన మీటర్లను త్వరితగతిన మార్చాలి



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సర్కిల్ పరిధిలో కాలిపోయిన, చెడిపోయిన విద్యుత్ మీటర్లను తక్షణమే మార్చాలని ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లులను ప్రతి నెలా ఏడులోపు అందజేయాలని సూచించారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి డిస్ కనెక్షన్ లిస్టును పక్కాగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ ఉచిత విద్యుత్ సర్వీస్ కనెక్షన్లకు నామమాత్రపు రుసుము రూ.30ను కొందరు చెల్లించలేదని, వీరితో మాట్లాడాలని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసిస్టెంట్ ఇంజినీర్లు కల్పన, అనిల్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పరమశివుడి స్మరణలోనే నిజమైన ఆనందం



ప్రవచిస్తున్న వరప్రసాద్‌రావు

నెల్లూరు(బృందావనం): పరమశివుడ్ని స్మరించడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని తెలియజేసే గ్రంథమే శివానందలహరి అని బ్రహ్మశ్రీ గుడ్లదొన వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పొగతోటలోని ఆది శంకర ధ్యాన మందిరంలో శివానందలహరిపై చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆయన ప్రవచించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రావును సత్కరించారు. మల్లవరపు లక్ష్మీనరసింహారావు, వంకా శ్రీహరిప్రసాద్‌రావు, దేవళం వెంకటసురేష్‌కుమార్, పట్టపురాజు సుబ్బారావు, సురభి మహాలక్ష్మి, హేమంత్‌కుమార్, సత్యనారాయణ, వెంకటశ్రీకాంత్, ప్రభాకర్‌శర్మ, ట్రస్ట్ కార్యదర్శి ములుమూడి ఉదయ్‌కుమార్, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి కృతజ్ఞతలు



నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారంలో చొరవ చూపిన వేమిరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

వేడుకగా సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): పౌర్ణమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో జరిపారు.

పట్టణ ప్రగతి యూనిట్ల ప్రారంభం



నెల్లూరు(బారకాసు): నెల్లూరు పట్టణ సమాఖ్య – 1, 3 ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ యూనిట్, జయభారత్ హాస్పిటల్ సమీపంలో మిర్చి మసాలా పౌడర్ తయారీ యూనిట్లను మెప్మా పీడీ రవీంద్రబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా గ్రాంట్ రూపంలో పొందిన యూనిట్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. టీఎల్ఎఫ్ – 1, 3 అధ్యక్షులు శైలజ, సుహాసిని, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, మెప్మా సిటీ ఇన్‌చార్జి శివకుమార్, ఎల్‌హెచ్ సుధాకర్, టీఈ అంకయ్య, సీఎంఎం పెంచలయ్య, సీఓ లక్ష్మీప్రసన్న, సీఎల్ఆర్పీలు సుమలత, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు అవార్డులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యుత్ శాఖ ఉద్యోగులకు అవార్డులను శుక్రవారం అందజేయనున్నారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, ఏకేనగర్ సెక్షన్లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటశివయ్య అత్యుత్తమ ప్రతిభ అవార్డులను సీఎండీ సంతోషరావు చేతుల మీదుగా అందుకోనున్నారు. వీరికి పలువురు అభినందనలను తెలియజేశారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



బీసీ సంఘ నేతలకు కండువా కప్పుతున్న శంకరయ్య

నెల్లూరు (వేదాయపాళెం): చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. నగరంలోని బీసీ స్టూడెంట్స్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రానంతరం ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించలేదని తెలిపారు. బీసీల అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. అనంతరం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులును నియమించారు. దయాకర్, జయరామరాజు, మురళి, సెంథిల్‌కుమార్, ఆకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తూ బస్సులు నడపాలి

వెంకటాచలం : డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ బస్సులు నడపాలని నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐ శివాజీ సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ శిక్షణ కేంద్రంలో గురువారం డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే రహదారుల్లో వాహనాలను చాకచక్యంగా, ఏ చిన్న పొరపాట్లకు తావివ్వకుండా నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్, ప్రిన్సిపల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.